# మానవత

ఆఫీసర్స్ క్లబ్బు చాలా సందడిగా వుంది. ఎవరికి నచ్చిన ఆట, వాళ్ళు ఆడుతున్నారు.

ఎవరికి నచ్చిన డ్రింకు వాళ్ళు తాగుతున్నారు. అక్కడి వాతావరణమే వేరుగా వుంది. అక్కడ చేరినవాళ్ళంతా మస్తుగా సంపాదిస్తున్న వాళ్ళే. అందుకే, విలాసాలాలకు యెంత ఖర్చయినా వాళ్ళు భయపడరు.

మెడికల్ ఆఫీసరు కొహిలీకి నిషాకలిగించే మత్తుపదార్థాలు తీసుకోవడం, అలవాటులేదు. అందుకే జోక్స్ వేస్తూ, కూల్‌డ్రింకు తీసుకుంటున్నాడు. "సార్, తమరికోసం యెవరో ఆడమనిషి వచ్చింది...." అంటూ కొహిలీతో చెప్పి పోయాడు, బేరర్.

డాక్టర్ కొహిలీ కనుబొమలు ముడిచి ఆలోచనల్లో పడ్డాడు. ఆమె యెవరై వుంటుందా అని! కాని, ఓ నిర్ధారణకి రాలేకపోయాడు.

అక్కడేవున్న హరినారాయణకి, క్లబ్బు క్కూడా యెవరైనా వస్తూండటం నచ్చలేదు.

"అయినా, క్లబ్బుక్కూడా వీళ్ళు యెందుకొస్తారో అర్థంకాదు డాక్టర్. ఈ కాస్సేపుకూడా మనల్ని సరదాగా వుండనివ్వరు. నాకిటువంటివి నచ్చవు. వెళ్ళొద్దు డాక్టర్! రేపు హాస్పిటల్‌కి రమ్మని కబురు పంపేయకూడదూ?" విసుగ్గా అన్నాడు హరినారాయణ.

"నో... నో.... ఏదో అత్యవసర పరిస్థితి కాకపోతే, ఓ స్త్రీ యింతవేళప్పుడు యిక్కడికి రావడం, అసంభవం. అసలు విషయంయేమిటో తెలుసుకుని వస్తానుండుహరీ" అంటూ తన మానవతను నిరూపించుకుని, బైటికి వెళ్లాడు కొహిలీ.

కొహ్లి బైటికొచ్చేసరికి ముప్పయ్యయిదేళ్ళ వనిత నిల్చునివుంది. అతణ్ణి చూడగానే "నమస్కారం సార్'' అందావె రెండు చేతులూ జోడిస్తూ, నువ్వూరు యేడుస్తున్నట్టుగానే. ఆమె స్వరమే డాక్టర్ కొహిలీని కొంత మేరకు కదిలించేసింది. ఆమె మొహంలో "కళ" అన్నది యెక్కడా లేదు. కళ్ళు లోతుకు పోయివున్నయ్.

"నమస్కారం... ఎవరమ్మా మీరు?" నెమ్మదిగా అడిగాడు కొహ్లీ. "మా ఆయన మీ ఆస్పత్రిలో వున్నారుసార్. ఆయనకి సీరియస్‌గా వుంది. డ్యూటీలో వున్న డాక్టరుగారు ఏమీ శ్రద్ధతీసుకోడంలేదు. పైగా, మమ్మల్ని మరీ నిరుత్సాహ పర్చేస్తున్నారు. మాకు వుండే ఆతృత, ఆవేదన, ఆయనకి వుండవు కదా! మీ గురించి విన్నాను. రోగుల పట్ల మీరు తీసుకునే శ్రద్ధ గురించి విన్నాను. మీకు కబురు పంపమని డ్యూటీలో వున్న డాక్టరు గారిని యెంతగానో ప్రాధేయపడ్డాను ఏడ్చాను కాని ఆయన మనస్సు కరగలేదు. క్లబ్బుకి కబురు పంపితే మీరు కోపగించుకుంటారని, రేపు చెబుతానని అంటున్నారు. జాప్యం జరిగితే యేం ముంచుకొస్తుందోనని మా ఆతృత. నా ఆవేదనని, ఆతృతనీ అర్థం చేసుకోండి సార్, నా పసుపు కుంకుమను కాపాడండి." వెక్కివెక్కి విలపిస్తోందామె.

కాస్త దూరంలో నిల్చుని అంతా వింటున్నాడు హరినారాయణ అతనికీ జాలివేసింది. అంతకు ముందు తానన్న మాటలకి, అతనికి సిగ్గేసింది.

డాక్టర్ కోహ్లీ యింక ఆలోచించలేదు.

"నువ్వేమీ కంగారుపడకమ్మా. ఆస్పత్రికి పద... నేను యిప్పుడేవస్తున్నాను." అన్నాడు.

ఆమె తృప్తిగా, కృతజ్ఞతాపూర్వకంగా నమస్కారం చేసి, తాను తీసుకొచ్చిన రిక్షాలోనే ఆస్పత్రికి పయనమయ్యింది.

డాక్టర్ కోహ్లీ వెనుదిరిగేసరికి, హరినారాయణ కనుపించాడు.

"అంతావిన్నావుకదూ హరీ? మెడిసిన్ చదివి, మానవత్వాన్ని కోల్పోవడం కంటె దారుణం మరోటి వుండదు. ఏమంటావ్? అన్నాడు, కోహ్లీ.

"నిజమే కోహ్లీ. నీ అసిస్టెంటు అలా చెప్పి వుండకపోవల్సింది. ఆ పరిస్థితుల్లోనే వారికి సానుభూతి అవసరం... వారిలో ఆశ పెంపొందించాలి. ధైర్యాన్ని నింపాలి. పాపం, ఆ ఇల్లాలు యెంతగా తల్లడిల్లిపోతోందో గమనించావు కదా!"

"అందుకే వెళ్తున్నాను. అక్కడ నాకు చాలా సమయం తీసుకోవచ్చు మళ్ళీ రేపు కలుద్దాం."

"డ్రాప్ చేసేదా?"

"ఎందుకూ? నా స్కూటర్ వుందిగా!"

"సరే! బై... గుడ్‌నైట్..."

డాక్టర్ కోహ్లీ, స్కూటరు స్టార్ట్ చేసి ముందుకు సాగిపోయాడు.

✪ ✪ ✪

డా. కోహ్లీ ఆస్పత్రికి వెళ్ళేసరికి, ఆమె మెయిన్‌గేటు దగ్గరే అగుపించింది. కోహ్లీ స్కూటరు శబ్దం వినగానే డ్యూటీలో వున్న డాక్టర్లు, నర్సులు కంగారుపడ్డారు. అంత రాత్రిపూట ఆయన రావడం చాలా అరుదు. అందుదే, ఆశ్చర్యపోయారు.

ఎమర్జన్సీ వార్డ్ ఇన్‌ఛార్జి డాక్టర్ మధుని చూస్తూనే అడిగాడు డాక్టర్ కోహిలీ.

మధూ! ఈవిడ భర్తకి ఎలా వుంది?"

"కాస్త కాంప్లికేటెడ్‌గానే వుందిసార్! నా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాను."

"పరిస్థితి అంతగా విషమించినపుడు నాకెందుకు ఫోన్ చెయ్యలేదు?" సూటిగానే అడిగాడు కొహిలీ.

"మీకు డిస్టర్బ్ చెయ్యడం ఎందుకని..."

డాక్టర్ కొహిలీ మొహం యెర్రబారింది. "నాన్సెన్స్. అది అర్థంలేని సాకు మీ అందరికీ యెన్నోసార్లు చెప్పాను- నా అవసరం వున్నప్పుడు జంకూ, గొంకూ లేకుండా నాకు ఫోన్ చెయ్యమని, డాక్టర్లకి నర్సులకి ముఖ్యంగా వుండాల్సింది మానవత్వం. మానవత్వంలేని డాక్టరు యెంత గొప్పవాడైనా డాక్టరే కాదంటాను. ప్రాణంవిలువ, కాలంవిలువ మనకి తెలియాలి. ఉదాహరణకి - ఈవిడ భర్తకి మన అజాగ్రత్త వల్లగాని, మన నిర్లక్ష్యం వల్లగాని, యేదైనా ప్రమాదం వాటిల్లిందనుకో... మళ్ళీ ప్రాణం పొయ్యగలమా? ఆమె పసుపు కుంకుమని నిలబెట్టగలమా? ఆపాటి జ్ఞానం, యింగితం, వుండాలి ఇటువంటి అశ్రద్ధను సహించలేను బ హేటిట్. ఇకముందు యిల్లాంటి పొరపాటు జరక్కూడదు. అండర్‌స్టాండ్? ఆ పేషెంటు దగ్గరికి పద... " అంటూ విసురుగా ముందుకు సాగిపోయాడు డాక్టర్ కొహిలీ.

అతని వెంట డాక్టర్ మధు, మిగిలిన డాక్టర్లు నర్సులూ నిశ్శబ్దంగా నడిచి, కొందరు మధ్యలో తప్పుకున్నారు.

ఆవిడ మెయిన్ గేటు దగ్గరున్న పొడుగుపాటి బెంచీమీద కూచుంది. డాక్టర్ కొహిలీ మంచితనానికి మనసులోనే జోహారులర్పించుకుంది.

డాక్టర్ కొహిలీ, పేషెంటుని చెకప్ చేసి, ఆపరేషన్ చెయ్యాలన్న నిర్ణయాని కొచ్చాడు. "మధూ ఆపరేషనుకి అర్జంటుగా ఏర్పాటుచెయ్యి" అంటూ ఆపరేషన్ రూమ్‌కేసి నడిచాడు.

మధు చకచకా యేర్పాట్లన్నీ చేశాడు. డాక్టర్ కొహిలీ ఆపరేషను పూర్తి చేశాడు. ఆపరేషను

విజయవంత మయిందన్న సంతృప్తి, అతని మొహంలో కొత్త వెలుగును తెచ్చింది.

"మధూ, యిప్పుడర్థమయ్యిందా, కాలం విలువేవిఁటో? ఆమె నా దగ్గరికి రాకుండా వుంటే, నీ నిర్లక్ష్యానికి ఫలితం యేంజరిగేదో వూహించావా? ఆమె ముందు నువ్వే ప్రముఖ నేరస్థుడిలా నిలబడి వుండాల్సి వచ్చేది. ఏది యేమైనా మన యీ వృత్తిలో అశ్రద్ధకు, అలక్ష్యానికి, రవ్వంతయినా తావుండకూడదు." సూటిగా మధు మొహం కేసి చూస్తూ, అన్నాడు డాక్టర్ కొహిలీ.

డాక్టర్ మధు మొహం స్వేదంతో నిండిపోయింది. జేబులోంచి రుమాలు తీసి, మొహాన్ని ఒత్తుకున్నాడు. అతను అర్థం చేసుకోగలిగాడు. యీ సమయంలో డాక్టర్ కొహిలీ రాకపోతే, యేం జరిగివుండేదో! తల్చుకుంటే, వొణుకు, పుట్టింది. "సారీసర్! బాధ్యతారహితమైన నా ప్రవర్తనకి, నేను యెంతో సిగ్గుపడుతున్నాను. నాలోని మానవత యేమయ్యిందా అని, యిప్పుడాలోచిస్తున్నాను. మనవృత్తి గురించి మీరు చెప్పిన మాటలు, నేను జీవితాంతం మర్చిపోలేని శిలాక్షరాలు. ఈ విషయంలో వెలుగు చూపించిన మీకు సర్వదా కృతజ్ఞుణ్ణి ఇలాంటి పొరపాటు మరెన్నడూ జరగదని హామీ యిస్తున్నాను సార్!" క్షమాపణ చెప్పుకుంటూ, అంతరంగంలో తాను అనుభవిస్తోన్న బాధను వ్యక్తపరిచాడు, డాక్టర్ మధు.

డాక్టర్ కొహిలీ చిరునవ్వు నవ్వుతూ, మధు భుజం తట్టాడు.

"దట్సాల్ రైట్...." అనుకుంటూ రూమ్ బైటికొచ్చాడు.

డాక్టర్ కొహిలీ మెయిన్ గేటుదగ్గరికి వచ్చేసరికి, ఆమె అక్కడే వుందింకా డాక్టర్ని చూడ్డంతోనే ఆతృతతో లేచి నుంచుంది. ఆమెతో పాటు మరో యిద్దరున్నారు. "సార్..." అందామె ఆసక్తితో, ఆమె స్వరం నూతిలోంచి మాట్టాడుతున్నట్టుగా వుంది.

"మరేం కంగారు పడకమ్మా నువ్వు చాలా అదృష్ట వంతురాలివి. నీ అదృష్టం బావుంది గనకనే నువ్వునన్ను వెదుక్కుంటూ క్లబ్బుకి వచ్చావు ఆపరేషను అవసరమయ్యింది. మరేం ఆలోచించకుండా ఆపరేషను చేశాను. విజయవంతమయ్యింది. మరికొద్ది సేపట్లో కళ్ళు తెరుస్తాడాయన నువ్వు నిశ్చింతగా యింటికి వెళ్ళొచ్చు మీ ఆయన్ని చూశాక." అన్నాడు డాక్టర్ కోహ్లీ

ఆమె అప్రయత్నంగా వంగి, అతని పాదాలకు ప్రణామం చేసింది. ఆమె కన్నీరు అతని బూట్లమీదపడి, కిందకు జారింది. అవి ఆనందబాష్పాలే మరి.

"లే అమ్మా లే, నాకు ప్రణమిల్లడ మెందుకు? నేనూ మీలాంటి మనిషినే! నా కర్తవ్యాన్ని నేను నిర్వర్తించాను ఫలితాన్నిచ్చింది భగవంతుడు. ఆ భగవంతుణ్ణి మనసులో కృతజ్ఞతాపూర్వకంగా

ధ్యానించు” అన్నాడు.

“ఈ జన్మలో మీ ఋణం తీర్చుకోలేను సార్! మీలాంటి వ్యక్తులు ప్రపంచంలో యే కొద్దిమంది వున్నా, మానవత్వపు విలువలు వున్నతస్థాయికి పెరిగేవి”

“అలాఅనకమ్మా! చెప్పానుకదా? నా విధిని నేను నిర్వర్తించాను. .. ఫలితాన్ని అందించిన వాడు పైనవున్నాడు. “అంటూ డాక్టర్ కోహ్లీ బైటికొచ్చి స్కూటర్ స్టార్ట్‌చేస్తూ వుంటే పన్నెండు కొట్టింది, గడియారం.

“నువ్వు చాలా అదృష్ట వంతురాలివమ్మా! పద.... మీ ఆయన్ని చూసి వెళ్ళిపోదువుగాని.” అన్నాడు డాక్టర్ మధు.

అతని మాటల్లో సౌమ్యత ధ్వనించింది. విస్తుపోయింది. ఆమె. ఇంతలోనే యెంత మార్పు? అనుకుంటూ డాక్టర్ మధుతో లోపలికి వెళ్ళింది.

కాస్సేపటి తర్వాత, భర్త కళ్ళు తెరచిచూసే సరికి, ఆమె ఆనందం పట్టలేకపోయింది. డాక్టర్ కోహ్లీకి, భగవంతునికి మనసులో కృతజ్ఞతలు చెప్పుకోకుండా వుండలేకపోయింది. మెళ్ళో మంగళసూత్రాన్ని తీసి కళ్ళకద్దుకుంది.

□□□

(స్వాతి వారపత్రిక - 17-8-84)